ప్రజాశక్తి

బుధవారం 15 ఫిబ్రవరి 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

పాలకపక్ష నేతలకు

సంకటంగా 'గడపగడపకూ..'

- నెలలో 16 రోజులు తిరగకపోతే మైనస్ మార్కుల్లో ఎమ్మెల్యేలు
- ఇదే టిక్కెట్లకు ప్రామాణికం చేయడంతో మళ్లీ పోటీపై ఆందోళన

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

గడపగడపకూ విధిగా తిరగాల్సిందేనని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పదేపదే ఎమ్మెల్యే లను, ఇన్‌ఛార్జిలను హెచ్చరిస్తున్నారు. ఇదే వచ్చే ఎన్నికల్లో పోటీకి ప్రామాణికంగా తేల్చడంతో మళ్లీ టిక్కెట్టు వస్తుందా? లేదా? అనే చర్చ ఎమ్మెల్యేల్లో నెలకొంది. కొందరు వెనుకబడి ఉన్నారు. కొందరు లక్ష్యాన్ని ఏదో రకంగా చేరుకున్నారు. సీనియర్ నేత బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా తప్పనిసరిగా తిరగాల్సి వచ్చింది. అయినా టిక్కెట్లపై సీనియర్ నేతలకు మిన హా మిగతా వారికి ధీమా కనిపించడం లేదు. సోమ వారం సాయంత్రం జరిగిన సమీక్షలో ఎవరు ఎన్ని రోజులు తిరిగారనే సమాచారం ఇచ్చారు.



గడపగడపకూ... కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు(ఫైల్)

ఉమ్మడి ప్రకాశంలో ముగ్గురు వెనుకంజలో ఉన్నారు. వారిలో దర్శి, గిద్దలూరు ఎమ్మెల్యేలు మద్దిశెట్టి వేణుగోపాల్, అన్నా రాంబాబు ఉన్నారు. పర్చూరు ఇన్‌ఛార్జి కొత్తగా బాధ్యతలు చేపట్టినందున ఆయన వెనుకబడినట్లు రికార్డుల్లో ఉన్నా సిఎం జగన్ పెద్దగా పట్టించుకున్నట్లు లేదు. అయితే గడపగడపకూ తిరగాలంటేనే నేతలకు సవాలుగా మారింది. ఇప్పుడు ఎన్నికల కోడ్ రావడంతో అధి కారులు, సచివాలయ సిబ్బంది కూడా పాల్గొనడం లేదు. దీంతో నిన్నటివరకూ అధికారులతో హడా వుడిగా తిరిగిన ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు ఇప్పుడు సాదాసీదాగా తిరగాల్సి వస్తోంది. జనం నుంచి వచ్చే అర్జీలకు ఇప్పుడు సమా ధానం చెప్పే పరిస్థితి లేదు. వాటిని తీసుకుని తర్వాత చూస్తామని చెబుతున్నారు. ఎన్నికల కోడ్ వచ్చాక పెద్దగా ఎవరూ తిరగడం లేదు. మంత్రి ఆదిమూలపు సురేష్ రెండు రోజులు తిరిగారు. ఆయన రాజకీయ విమర్శలతోనే ముగించారు. మిగతా నేతలు ఎవరూ ఇప్పుడు తిరగడం లేదు. ఇక గ్రామాల్లో తిరిగిన చోట్ల నిధులు ఇస్తామని చెప్పారు. వాటిని నమ్ముకొని కొందరు పనులు చేశారు. ఇప్పుడు బిల్లులు లేవంటున్నారు. చాలా మంది ద్వితీయశ్రేణి నేతలు తలలు పట్టుకుంటున్నారు. పనులెందుకు చేశా మా? అని లబోదిబోమంటున్నారు. ఇలాంటి నేతలు కూడా ఎమ్మెల్యేలపై ఒత్తిడి చేస్తున్నారు. కొత్తగా పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. స్థానికసంస్థల్లో నిధుల్లేవు. కార్పొరేషన్లు, మున్సి పాల్టీలు, నగర పంచాయతీల్లోనూ ఇదే పరిస్థితి. చేసిన పనులకు బిల్లులు ఇవ్వడం ▶ 2లో

ముండ్లమూరులో భూకంపం

ప్రజాశక్తి-ముండ్లమూరు: మండలంలో మంగళవారం సాయంత్రం 6.30 నిమిషాలకు భూమి కంపించింది. మండలంలోని ముండ్లమూరు, వేంపాడు, పోలవరం, శంకరాపురం గ్రామాల్లో రెండు సెకన్ల పాటు భూమి కంపించడంతో ప్రజలు భయబ్రాంతులకు గురయ్యారు. ఒక్కసారిగా శబ్దం రావడంతో కుర్చీలు, బల్లలపై కూర్చున్న ప్రజలు ఏమైందోనని భయంతో ఉలిక్కిపడ్డారు. భూమి శబ్దం రావడంతో ఇళ్లలో నుండి ప్రజలు బయటకు పరుగులు తీశారు.

సైకిల్ తొక్కటం ఆరోగ్యకరం

విద్యార్థులతో కలిసి సైకిల్ తొక్కిన కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-చీరాల

సైకిల్ తొక్కడం ద్వారా ఆరోగ్యం ఎంతో పది లంగా ఉంటుందని జిల్లా కలెక్టర్ కె.విజయకష్ణన్ తెలిపారు. ఆరోగ్యం కోసం సైకిల్ ర్యాలీ కార్యక్ర మాన్ని కలెక్టర్ మంగళవారం చేపట్టారు. సైకిల్ ర్యాలీ కార్యక్రమం ప్రారంభ సూచికగా బెలూన్‌ల ను గాలిలోకి ఎగురవేసి ర్యాలీని కలెక్టర్ ప్రారం భించారు. చీరాల మున్సిపల్ కార్యాలయం నుంచి ఒకటిన్నర కిలోమీటర్‌కు పైగా దూరమున్న మార్కె ట్ సెంటర్‌లోని విజయ స్థూపం వరకు సైకిల్ ర్యాలీ జరిగింది. ర్యాలీ ముందు భాగంలో కలెక్టర్ విజయకష్ణన్ పాల్గొని సైకిల్ తొక్కి ▶ 2లో



సైకిల్ తొక్కుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

పాలకపక్ష నేతలకు సంకటంగా 'గడపగడపకూ..'

(మొదటిపేజీ తరువాయి)

లేదు. కొత్తగా ఎవరికి పనులు ఇచ్చినా చేపట్టడం లేదు. టెండర్లు పిలిచి కూడా నిలిపేశారు. ఇలాంటి పరిస్థితి కొనసాగుతోంది. వీటికి సమాధానం చెప్పలేకనే ఎమ్మెల్యేలు కూడా గడపగడపకూ వెళ్లాలంటే జంకుతున్నారు. సిఎం జగన్ మాత్రం ప్రతి ఇంటికీ తిరగాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలు కన్నా ఇన్‌ఛార్జిలుగా ఉన్న యువ నేతలే ఈ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో పూర్తి చేస్తున్నారు. రాజకీయంగా తమకు సానుకూలత లేని ఎమ్మెల్యేలు దీనిపై పెద్దగా ఆసక్తి చూపడం లేదు. మళ్లీ టిక్కెట్టుపై నమ్మకం లేని నేతలూ ఇదే దారిలో ఉన్నారు. వైపాలెం, ఒంగోలులో ఉన్న సీనియర్ నేతలకు తప్ప మిగతా నియోజకవర్గాల్లో సిట్టింగులకు గ్యారంటీగా టిక్కెట్లు వస్తాయనే ధీమా కనిపించడం లేదు. గడపగడపకూ తిరిగిన పనితీరు ఆధారంగానే ఖరారు చేస్తామని సిఎం చెప్పడం చర్చగా మారింది. మే నెలలో మరోసారి సమీక్ష జరగనుంది. అప్పటికి పోటీ చేసే అభ్యర్థులపై ఓ స్పష్టత వస్తుందని చెబుతున్నారు. ఏదేమైనా సవాలక్ష సమస్యల నడుమ గడపగడపకూ వెళ్లాలంటే పాలకపక్ష నేతలు తలలు పట్టుకుంటున్నారు. ఇంకా చెప్పాలంటే బలవంతంగా తిరుగుతున్నారు. ఈ మధ్య కాలంలో పెళ్లిళ్లకే ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో గడపగడపకూ కార్యక్రమం కొంత మందగించింది. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలు రావడంతో పెద్దగా ముందుకు సాగడం లేదు. నెలలో 16 రోజులు అతికష్టం మీద పూర్తి చేస్తున్నారు. టిక్కెట్టు కావాలంటే విధిగా గడపగడపకూ తిరగక తప్పదు. ఎంతమంది ఈ లక్ష్యాన్ని చేరుకుంటారో చూడాల్సిందే.

సైకిల్ తొక్కటం ఆరోగ్యకరం

(మొదటిపేజీ తరువాయి)

విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ సైకిల్ తొక్కడం ఎంతో ఉత్తమమని కలెక్టర్ అన్నారు. క్యాన్సర్ బారిన పడకుండా మన ప్రాణాలను పరిరక్షించుకోవచ్చని తెలిపారు. నిరంతరం సైకిల్ వాడకం ద్వారా శరీర ధారుఢ్యం మెరుగుతుందన్నారు. మానసిక ఒత్తిడి నుంచి విముక్తి కల్పిస్తుందన్నారు. విద్యార్థి దశ నుంచే సైకిల్ వాడటం ద్వారా ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని వివరించారు. సైకిల్ తొక్కడం అలవాటుగా మారాలన్నారు. ముఖ్యంగా వాహనాల వినియోగం తగ్గితే పెట్రోల్, డీజిల్ కొరత అధిగమించవచ్చన్నారు. కాలుష్యాన్ని నియంత్రించ వచ్చుని, పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. మొక్కలు నాటితే అవి పెరిగి పెద్దయ్యాక వాతావరణం సమతుల్యతకు ఎంతో ఉపకరిస్తుందన్నారు. వీటన్నిటినీ గుర్తుంచుకొని భావితరాలకు మంచి వాతావరణం కల్పించాలని ఆమె పలు సూచనలు చేశారు. విద్యార్థులంతా చక్కగా చదువుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని తెలిపారు. విద్యార్థులంతా ప్రతిరోజూ సైకిల్ తొక్కి మీ ఆరోగ్యాన్ని పదికాలాలు చల్లగా ఉంచుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ తెలిపారు. మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే ఉందని ఆమె వివరించారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులంతా భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో చీరాల ఆర్డీవో పి సరోజినీ, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు, మున్సిపల్ కమిషనర్ ఐసయ్య, తహశీల్దారు ప్రభాకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనాసుర రక్తచరిత్ర పుస్తకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-వెలిగండ్ల

వైసిపి ప్రభుత్వం టిడిపిపై ఎన్ని కుట్రలు చేసినా, ఎన్ని కేసులు పెట్టినా ప్రశ్నించడం ఆగదని టిడిపి మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జగనాసురా రక్త చరిత్ర పుస్తకాన్ని మంగళవారం విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెంకటరెడ్డి మాట్లాడారు. లోకేష్ పాదయాత్రతో వైసిపికి గుబులు పుట్టిందన్నారు. పాదయాత్ర సక్రమంగా జరగకుండా పోలీసుల ద్వారా అడ్డంకులు సష్టిస్తున్నారని తెలిపారు. మండలంలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి జగనసురా రక్త చరిత్ర పుస్తకాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రైతు సంఘ నియోజక వర్గ అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు కర్నాటి భాస్కర్‌రెడ్డి, తెలుగు రైతు మండల అధ్యక్షుడు మీనిగ కాశయ్య, టిడిపి నాయకులు మోటాటి సుబ్బారెడ్డి, కేసరి రమణరెడ్డి, దారెడ్డి సుబ్బారెడ్డి, ఎస్‌సిసెల్ మండల అధ్యక్షుడు గోనా వెంకటయ్య, దేవా బొప్పరాజు, లక్ష్మీ నారాయణ, పోకల పుల్లారెడ్డి, చందా కాశీరెడ్డి, మేడం మహేష్‌రెడ్డి, బొబ్బా నాగభూపాల్‌రెడ్డి, అంకయ్య, వాలిచర్ల శ్రీను, మాల్యాద్రి, కొండు భాస్కరరెడ్డి, బొబ్బా తిరుపతిరెడ్డి, మహేష్ పాల్గొన్నారు. **హనుమంతునిపాడు:** రాష్ట్రంలో నరకాసుడి పాలన సాగుతుందని టిడిపి మండల అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జగనాసుర రక్త చరిత్ర పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గాయం తిరుపతిరెడ్డి, మురహరి నరసయ్య, గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, పగడాల శ్రీరాములురెడ్డి, గంగిరెడ్డి రమేష్‌రెడ్డి, దారా నారాయణ,వై. నారాయణరెడ్డి, పోల్‌రెడ్డి తాతిరెడ్డి, బాలవెంకటనారాయణ, బాలగురవారెడ్డిపాల్గొన్నారు.



జగనాసుర రక్తచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

దేశభక్తిని పెంచుకోవాలి : సిఐ

మార్కాపురం : ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంచుకోవాలని మార్కాపురం సిఐ ఎం.భీమానాయక్ విద్యార్థులకు సూచించారు. స్థానిక కమలా హైస్కూల్ విద్యార్థులు 14 బ్లాక్ డే సందర్భంగా మంగళవారం పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజంతా ఐకమత్యంతో మెలగాలనిసూచించారు. అనంతరం అమర జవాన్లకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పిఇటి శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో ఘర్షణ

తెగిపడిన చెవి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని వీరభద్రాపురం పంచాయితీ పరిధిలో గల గడ్డమీదపల్లి గ్రామంలో స్థల వివాదంలో ఒకరిపై దాడి చేసి చెవి తెగి ఊడిపడేలా తీవ్రంగా గాయపరిచిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. గడ్డమీదపల్లి గ్రామానికి చెందిన సూరెబోయిన మురళికి అదే గ్రామానికి చెందిన మాచుపల్లి నాగరాజు, మాచుపల్లి బాలు, మాచుపల్లి బాల గురవయ్యలకు స్థలం విషయంలో ఘర్షణ జరిగింది. అయితే మురళిని మాచుపల్లి నాగరాజు, మాచుపల్లి బాలు, మాచుపల్లి బాల గురవయ్యలు తీవ్రంగా కొట్టారు. ఏకంగా మురళి చెవిని ఊడి కిందపడేలా కొరికారు. దీంతో అర్ధరాత్రి సమయంలో క్షతగాత్రుడు మురళిని హుటాహుటిన యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్సల అనంతరం క్షతగాత్రునితో పాటు తెగిపడిన చెవిని కూడా ఐస్ బాక్సులో పెట్టి మెరుగైన చికిత్స కోసం ఒంగోలులోని రిమ్స్‌కు తరలించారు. ఘర్షణలు చేసుకోవడం సహజం. కర్రలతో, రాళ్లతో కొట్టుకోవడం మామూలే. అయితే ఏకంగా చెవి తెగి కింద పడేలా కసి తీరా కొరికారంటే వారి మనసులో ఎంత కుట్రలు ఉన్నాయో ఇట్టే అర్థమవుతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.





చెవి వద్ద గాయం, తెగిపడిన చెవి

ఉద్యమనేతలను గెలిపించాలి: జెవివి

ప్రజాశక్తి-పామూరు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యమ నేతలను గెలిపించాలని జెవివి జిల్లా నాయకుడు వి మాలకొండారెడ్డి తెలిపారు. ఉద్యమ నేతలు గెలుపొందితే ప్రజా సమస్యల కోసం మండలిలో గొంతు విప్పుతారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ సిఎస్‌పురం, పామూరు సచివాల యాల్లో ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి బ్రహ్మారెడ్డి, పి. వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగులతో మాట్లాడుతున్న మాలకొండారెడ్డి

చిన్నారిని చితకబాదిన ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి-పర్చూరు: పర్చూరు మండలం ఉప్పుటూరు ఉర్దూ పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న బాలికను ఉపాధ్యాయుడు చితకబాదాడు. ఇది తెలుసుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు ఎందుకు కొట్టారని ప్రశ్నిస్తే వారిపై కూడా దురుసుగా మాట్లాడారు. దీంతో తల్లిదండ్రులు మండల విద్యాశాఖాధికారి డి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై విచారించి సదరు ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామని నాగేశ్వరరావు వివరించారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

ప్రజాశక్తి-ఇంకొల్లురూరల్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన ఇంకొల్లు మండలం ఇడుపులపాడులో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన గుంజి వీరాస్వామి(35)కి 12 సంవత్సరాల క్రితం మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామానికి చెందిన లక్ష్మితో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. గత నెల రోజులుగా వీరిద్దరి మధ్య మనస్పర్ధలు రావటంతో విడివిడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం చూసేసరికి ఇంట్లో ఉరేసుకొని మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు. రక్తపు మడుగులో ఉన్నట్లు ఆనవాళ్లు ఉన్నాయి. మృతుని తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఇంకొల్లు ఎస్ఐ షేక్ నాయబ్ రసూల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రొటెక్షన్ వాచర్‌పై ఎలుగుబంటి దాడి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల దద్దనాల సమీపంలో ప్రొటెక్షన్ వాచర్ దంసాని బసవయ్యపై సోమవారం రాత్రి ఎలుగుబంటి దాడి చేసింది. తీవ్రంగా గాయపరిచింది. విధులు నిర్వహించేందుకు పెద్దమ్మబేస్ క్యాంపు వైపు వెళ్తున్న సమయంలో వెనుక నుంచి ఎలుగుబంటి ఒక్కసారిగా దంసాని బసవయ్యపై దాడి చేసింది. తీవ్రంగా గాయ పరిచింది. గాయ పడిన బసవయ్యను అటవీ శాఖాధికారుల సహాయంతో ఐటిడిఎ వాహనంలో యర్రగొండపాలెంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్సలు అందిస్తున్నారు. కాగా చికిత్సలు పొందుతున్న దంసాని బసవయ్యను మార్కాపురం ఫీల్డ్ డైరెక్టర్ విఘ్నేష్ అప్పావు పరామర్శించారు. సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్యులతో మాట్లాడారు. మెరుగైన చికిత్సలు అందించాలని కోరారు. బసవయ్య కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట యర్రగొండపాలెం, గంజివారిపల్లి అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు.

తహశీల్దారుకు ఫిర్యాదు

ప్రజాశక్తి-కంభం రూరల్

కంభం పట్టణంలోని కందులాపురం సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి సమీపంలో ఏర్పాటు చేసిన ఎంఆర్‌పిఎస్ జెండాను తొలగించాలని కోరుతూ ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. ఆ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించడాన్ని నిరసిస్తూ తహశీల్దారుకు కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు చేసినట్లు ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి షాలేంరాజు తెలిపారు. ఈ సందర్భంగా షాలేంరాజు మాట్లాడుతూ అంబేద్కర్ బొమ్మ సమీపంలో పలు ప్రజాసంఘాల జెండాలను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. అయితే చెన్నకేశవరావు అనే వ్యక్తి ఎంఆర్‌పిఎస్ జెండా అంబేద్కర్ విగ్రహానికి అడ్డుగా ఉందని తొలగించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. 1994లో ఇక్కడ ఎంఆర్‌పిఎస్ జెండాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ తర్వాతే అక్కడ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

పాము కాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

పాము కాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని నాగరాజుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, గ్రామ సర్పంచ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎస్టీ కాలనీ వద్ద నివాసం ఉండే కొణిదెన వీరవాణి(40) గత శుక్రవారం పొలంలో కూలి పనులకు వెళ్లిన క్రమంలో అక్కడ పాముకాటుకు గురయ్యింది. గమనించిన తోటి కూలీలు స్థానిక వైద్యుల వద్ద ప్రథమ చికిత్స అందించి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం చిలకలూరిపేటలోని కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. అయితే మంగళవారం పరిస్థితి విషమించి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు.



విఆర్ఏ సంపూర్ణరావుకు నివాళి అర్పిస్తున్న యద్దనపూడి తహశీల్దారు వెంకటరెడ్డి

అనంతవరం విఆర్ఎ మృతి

ప్రజాశక్తి-యద్దనపూడి

మండలంలోని అనంతవరం గ్రామ విఆర్ఎ మంగళవారం దాసరి సంపూర్ణరావు మృతి చెందాడు. యద్దనపూడి తహసీల్దార్ వెంకటరెడ్డి మృతునికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పది వేల రూపాయలు అందించారు. మృతునికి భార్య హేమలత, కుమారుడు రత్న కిషోర్, కోడలు సంధ్య, మనుమడు, మనుమరాలు ఉన్నారు. తహశీల్దారు వెంట విఆర్ఒలు శేషుబాబు, రవి, విఆర్ఎలు అశోక్, సుబ్బారావు, మీరాసా, తహశీల్దారు కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఫ్లెక్సీ తొలగింపులో అపశృతి..

విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

ప్రజాశక్తి-కారంచేడు

మండలంలోని స్వర్ణ గ్రామంలో ఫ్లెక్సీ బ్యానర్ తొలగిస్తున్న సమయంలో ఆ బ్యానర్ పక్కనే ఉన్న కరెంటు ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి మట్టే అహరోను(20) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పక్కనే ఉన్న సలగల బాబు అనే యువకునికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వైద్యశాలకు తరలించారు. వివరాల్లోకెళ్తే గ్రామంలో పంచాయతీ కార్యాలయానికి సమీపంలో ఉన్న పల్లెలో వారం క్రితం ఒక పెళ్లి సందర్భంగా కట్టిన బ్యానర్ మంగళవారం తొలగించే పని యువకులు చేపట్టారు. ఈ క్రమంలో బ్యానర్ కున్న కర్రలు తొలగించే క్రమంలో ఆ బ్యానర్ గాలికి పక్కనే ఉన్న కరెంటు ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. దీంతో బ్యానర్ తొలగిస్తున్న యువకుడు మట్టే అహరోను(20) అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలపాలైన సలగల బాబును చీరాల వైద్యశాలకు తరలించారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

ప్రజాశక్తి-దొనకొండ

ఈ నెలాఖరులోగా మండలంలో ఇంటి పన్ను నూరు శాతం వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జీవీ నారాయణరెడ్డి తెలిపారు. మండలంలోని తెల్లబాడు పంచాయతీలో సిబ్బంది చేపట్టిన ఇంటి పన్ను వసూలు ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా కేవలం 46 శాతం మాత్రమే ఇంటి పన్ను వసూలు జరిగిందని, దీన్ని నూరు శాతంగా చేసేలా సిబ్బంది పని చేయాలన్నారు. ప్రజలందరూ ఇంటి పన్ను సకాలంలో చెల్లించి అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. పారిశుధ్య కార్మికులను శాలువలతో ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఎంపీడీఓ వి వసంతరావునాయక్, ఈఓఆర్‌డీ ఎస్ డేవిడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కంపు కొడుతున్న దండుబాట రోడ్డు

రోజుల తరబడి నిలిచిన మురుగునీరు • పట్టించుకోని మునిసిపల్ అధికారులు • భయభ్రాంతుల్లో స్థానికులు

ప్రజాశక్తి-చీరాల

చీరాల దండుబాట రోడ్డు అపరిశుభ్రతతో కంపు కొడుతోంది. పట్టణ అభివృద్ధికి కోట్లు ఖర్చు పెట్టామని చెప్పుకుంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులు ఆ రోడ్డు వైపు మాత్రం కన్నెత్తి చూడటం లేదు. అధికారుల అలసత్వానికి దండుబాట రోడ్డు నిదర్శనంగా నిలుస్తోంది. దండుబాట రోడ్డులోని మురుగునీటి పారుదల కాలువ చూస్తుంటే గతంలో అధికారులు డ్రైనేజీలను నిర్లక్ష్యంగా నిర్మించినట్లు అర్థమవుతోంది. దీంతో దండుబాట స్థానిక వాసులు నిత్యం మురుగు కంపుతో అల్లాడిపోతున్నారు. వర్షం పడిందంటే అక్కడి వాసులు దుర్వాసనతో ఇబ్బంది పడాల్సిందే. డ్రైనేజీ నిర్మాణాన్ని ఎగువ ప్రాంతం నుంచి దిగువ ప్రాంతంలోని డ్రైనేజీ అనుసంధానం చేస్తూ నిర్మించాలి. అయితే ఆ ప్రాంతంలో అధికారులు అందుకు భిన్నంగా డ్రైనేజీలు నిర్మించారు. కాలువలు రోడ్లు కన్నా ఎక్కువ ఎత్తులో ఉండటంతో వర్షం పడితే కాలువలోని నీళ్లన్నీ ఇళ్లల్లోకి చేరటం, విష జంతువులు సంచరించడం నిత్యం కనిపిస్తూనే ఉంటుంది. దండుబాట ప్రాంతంలో పారిశుధ్య పనులు అంటే మునిసిపల్ అధికారులకు చిన్నచూపుగా ఉంటోందని ఆ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా మురుగునీరు కాలువలలో నిలిచి ఉండడంతో దుర్వాసనతో పాటు దోమల వ్యాప్తి అధికంగా ఉండి అంటూ రోగాల బారిన పడవలసి వస్తుందని స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆ ప్రాంతంలో మురుగనీటి సమస్యపై మున్సిపల్ అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.



దండుబాట రోడ్డులో దుర్వాసన వెదజల్లుతూ నిలిచిన ఉన్న మురుగునీరు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రకాశం జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉపాధిహామీ పథకంలో మస్టర్ల నమోదు, వేతనాల విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని ఎలాంటి అవకతవకలు లేకుండా నిర్వహించాలని ఆదేశించారు. జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా పర్యవేక్షించాలని, ఉగాది నాటికి నిర్దిష్ట లక్ష్యాన్ని చేరుకునేలా చూడాలని హౌసింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. నిర్మాణ పనులలో పురోగతిని తెలిపే విధంగా ప్రతిరోజూ జిల్లా కేంద్రానికి ఫొటోలు పంపాలన్నారు. లబ్ధిదారులైన స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇళ్ల నిర్మాణం కోసం అవసరమైన



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్

రుణాలు త్వరగా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిఆర్‌డిఏ అధికారులకు కలెక్టర్ సూచించారు. లే అవుట్ స్థాయి అధికారులు చురుగ్గా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. సర్వేసులకు సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్‌కు సంబంధించిన ఈకెవైసిని వేగంగా పూర్తి చేయాలన్నారు. జగనన్న తోడు లబ్ధిదారులకు బ్యాంకు నుంచి రుణాలు అందించడంలో అలసత్వం వహించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. "గడప గడపకూ మన ప్రభుత్వం"లో ఇప్పటివరకూ అనుమతులు పొందిన నిర్మాణ పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ నిర్మాణ పనుల పురోగతిని తెలిపేలా ఫొటోలను కలెక్టరేట్‌కు పంపించాలన్నారు. మండల స్థాయి ప్రత్యేక అధికారులు ఈ నిర్మాణాల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. జగనన్న పాల వెల్లువ పథకంలో మరింతమంది పాడి రైతులు అమూల్ సంస్థకు పాలు పోసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో హౌసింగ్ పీడీ పేరయ్య, సిపిఒ డి వెంకటేశ్వర్లు, డిఇఒ పి రమేష్, జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి ఉషారాణి, పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ బేబీరాణి, పిఐఒ సామా సుబ్బారావు పాల్గొన్నారు.

యుటిఎఫ్ బాపట్ల జిల్లా కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నిజాంపట్నం





వినయ్ కుమార్, బాపయ్య

యుటిఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షులుగా జె వినయ్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్‌గా సిహెచ్ బాపయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం బాపట్ల జిల్లా యుటిఎఫ్ ప్రథమ కౌన్సిల్ ఎన్నిక అద్దంకిలో జరిగింది. ప్రస్తుతం వినయ్‌కుమార్ నిజాంపట్నం మండలంలోని శారద నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గాను, బాపయ్య బెల్లంకొండవారిపాలెం పాఠశాల ప్రధానోపాధ్యాయులుగానూ ఉన్నారు. వీరికి మండల శాఖ అధ్యక్షులు దబ్బకూటి హరిబాబు ప్రధాన కార్యదర్శి సిహెచ్ గణేష్‌రావు, ఉపాధ్యక్షులు అబుల్ మాలిక్, లావణ్య, కోశాధికారి రాజేష్, గౌరవాధ్యక్షులు వై శ్రీనివాసరావుతో పాటు నిజాంపట్నం మండల శాఖ బాధ్యులు అభినందనలు తెలిపారు.

కోడిగుడ్లు దొంగతనంపై డిఇఒ విచారణ

ప్రజాశక్తి-వేటపాలెం

కోడిగుడ్లు దొంగతనంపై సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు బాపట్ల జిల్లా డిఇఒ పివిజె రామారావు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కోడిగుడ్లు దొంగతనం కథనాలు మీడియా ద్వారా తెలుసుకొని మంగళవారం విచారణ నిమిత్తం వచ్చినట్లు రామారావు తెలిపారు. మూడు గుడ్లు దొంగతనం గురించి టీచర్ల వద్ద నుంచి రాతపూర్వకంగా లెటర్లు తీసుకొన్నారు. స్కూల్లో బాధ్యతలను ఉమ్మడిగా నెరవేర్చితేనే మంచి ఫలితాలు వస్తాయని హితవు పలికారు. స్కూల్లో మొత్తం వెయ్యి మంది పిల్లలు ఉంటే కేవలం రెండు వందల విద్యార్థులు భోజనం తినడంపై విస్మయం వ్యక్తం చేశారు. పిల్లలతో పాటు టీచర్లు కూర్చుని తింటే మధ్యాహ్న భోజన పథకం ప్రాధాన్యత తెలుస్తుందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాల్సి బాధ్యత అందరిపై ఉందని అన్నారు. భోజనాన్ని పరిశీలించి పులిహోర పసుపు అన్నంలా ఉందన్నారు. ఒడియాలు రుచి చూసి ఇవి సరిగా ఉడకలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎంవిఎస్ శర్మ, చీరాల, వేటపాలెం ఎంఇఒలు నాగేశ్వరరావు, సుబ్బయ్య, స్కూల్ హెచ్ఎం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



డిఆర్‌ఒకు వినతిపత్రం అందజేస్తున్న విఆర్‌ఎలు

విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్: విఆర్‌ఎల సమస్యలు పరిష్కారం చేయాలని గ్రామ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త పిలుపు సందర్భంగా మంగళవారం డిఆర్‌ఒకు నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి, ఫేస్ యాప్, బయో మెట్రిక్ రద్దు చేయాలి. అర్హులకు పదోన్నతులు కల్పించాలి. డిఏ కూడిన వేతనం ఇవ్వాలి. గ్రామ సేవకుల సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకంగా ఉన్న పనులు అప్పజెప్పరాదని అన్నారు. భూ సర్వే సందర్భంగా టీఏ, డీఏలు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ మాట్లాడుతూ తమ పరిధిలోని ప్రమోషన్‌లు, ఎవరైనా మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు ఏడాదిలోపు కారుణ్య నియామకం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జంగం శామ్యూల్, విఆర్‌ఏ సంఘ నాయకులు మన్నెం వెంకటేశ్వరరావు, తమనం శ్రీనివాసరావు, సురేంద్ర, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సమావేశం

ప్రజాశక్తి-అద్దంకి: ఏపీఎస్ఆర్టీసీ జిల్లా పరిధిలోని మరియు అద్దంకి బస్టాండ్లను వాణిజ్య వ్యాపార ప్రాతిపదికన పబ్లిక్ మరియు ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిన అభివృద్ధి చేసేందుకు నిర్ణయించినట్లు డిపో మేనేజర్ రామ్మోహన్‌రావు తెలిపారు. దీనికి సంబంధించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సమావేశం ఈ నెల 16వ తేదీ ఉదయం 11 గంటలకు అద్దంకి డిపోలో, అదేరోజు సాయంత్రం నాలుగు గంటలకు బాపట్ల జిల్లా అధికారి వారి కార్యాలయంలో అవగాహన సదస్సు జరిపేందుకు నిర్ణయించినట్లు డిపో మేనేజర్ రామ్మోహన్‌రావు తెలిపారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు హాజరు కావాలని కోరారు.

ఎస్ఎఫ్ఐ, జెవివి, యుటిఎఫ్ ఆధ్వర్యంలో..

16,17 తేదీల్లో పదో తరగతి మోడల్ పరీక్ష

ప్రజాశక్తి-చెరుకుపల్లి



మోడల్ పరీక్ష ప్రజ్ఞ వికాసం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఒ పులి లాజరు, మనోజ్

బాపట్ల జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఈ నెల 16, 17 తేదీలలో పదో తరగతి మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి మనోజ్ కుమార్ అన్నారు. మంగళవారం గుల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోడల్ పరీక్ష గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భట్టిప్రోలు ఎంఈఒ, గుల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులి లాజర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మోడల్ పరీక్షలు చక్కటి పరిజ్ఞానాన్ని, అవగాహనను అందిస్తాయని అన్నారు. ఎస్ఎఫ్ఐ, జెవివి, యుటిఎఫ్ ఆధ్వర్యంలో సీనియర్ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో రూపొందించబడిన ప్రశ్న పత్రం ద్వారా నిర్వహించే మోడల్ పరీక్ష ద్వారా పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు చక్కటి తోడ్పాటు అందిస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి మనోజ్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేష్, తిమోతి తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి

ప్రజాశక్తి-నిజాంపట్నం: రబీ పంటకు సంబంధించి మండలంలోని రైతులందరూ తప్పనిసరిగా ఈ-క్రాప్ బుకింగ్ ఈకేవైసీ చేయించుకునేలా వ్యవసాయ శాఖ సిబ్బంది చొరవ తీసుకోవాలని ఎంపీడీవో ఎస్ నాగలక్ష్మి సూచించారు. రబీ పంటకు సంబంధించి మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది చేస్తున్న ఈ-క్రాప్ బుకింగ్ ఈకేవైసీ ప్రక్రియను ఎంపీడీవో పరిశీలించారు. ఈ-క్రాప్ బుకింగ్ ఈకేవైసీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. మండల ప్రోగ్రెస్ చాలా తక్కువగా వున్నదని, రైతులు పీఎం కిసాన్ వంటి పథకాలకు రైతు భరోసా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి ఆధార్ కార్డు ఇచ్చి ప్రతి ఒక్కరూ ఈ కేవైసీ చేయించుకోవాలని కోరారు. ఏఈఓ శ్రీనివాసరావు, వి ఏఏలు నిజాంపట్నం, కూచినపూడి, ఆముదాలపల్లి రైతుల ఈకేవైసీ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎం కొండయ్య

వివేకాను కుటుంబ సభ్యులే చంపారు: కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

సీఎం జగన్ తన రాజకీయ పదవి కోసం తెలుగుదేశం పార్టీ ఎదుగుదలను ఓర్వలేకలేక 2019 మార్చిలో జరిగిన వివేకానంద రెడ్డి హత్య కేసును తెలుగుదేశం పార్టీకి అంటగట్టే ఆలోచన చేశారని, కుటుంబ సభ్యులే వివేకానందను హతమార్చిన సంగతిని ప్రజలందరూ గమనిస్తున్నారని తెలుగుదేశం పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య అన్నారు. స్థానిక కొత్తపేట టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సిబిఐతో విచారణ జరిపి అసలైన దోషులను వెలుగులోకి తీసుకురావాలని అన్నారు. కోడి కత్తి పథకం రచించి సానుభూతి సంపాదించిన జగన్ ఆనాడు కూడా టిడిపిపైనే ఆరోపణలు చేశారన్నారు. టిడిపిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని, త్వరలోనే అసలైన దోషులు బయటికి వస్తారని అన్నారు. వైసిపి పరిపాలన వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో హింసాత్మక పాలన సాగుతోందని, రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని, త్వరలోనే వైసీపీ పాలనకు ప్రజలు బుద్ధి చెబుతారని అన్నారు. ఆయన వెంట టిడిపి సీనియర్ నాయకులు కొత్తవరపు జనార్ధన్, పట్టణ అధ్యక్షుడు గజవల్లి శ్రీను, పలువురు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 102వ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పించారు. మాల మహానాడు బాపట్ల జిల్లా అధ్యక్షుడు రోజన్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం బాపట్లలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సమతా సైనిక్ దళ్ జిల్లా నాయకులు దగ్గుమల్లి శ్రీకర్, మంచాల ఆనంద్, దోనేపూడి హేమంత్, జాన్ ప్రసన్న బాబూరావు, బీసీ సంక్షేమ సంఘం బాపట్ల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల మహేష్, ఎస్ఎస్‌పి రాజు, ఎర్రకుల వాసు, మస్తాన్ వలి, సలగల సురేష్ పాల్గొన్నారు.

గాంధీ విగ్రహ ఏర్పాటు సంతోషదాయకం: కోన

ప్రజాశక్తి-కర్లపాలెం

కర్లపాలెం మండలం చింతాయపాలెం గ్రామంలో మహాత్మాగాంధీ నూతన విగ్రహం ఏర్పాటు చేయటం ఎంతో ఆనందదాయకమని ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ స్పీకర్, బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి అన్నారు. మంగళవారం కర్లపాలెం మండలం చింతయపాలెం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వైసిపి ఇన్‌ఛార్జి మరక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మాగాంధీ నూతన విగ్రహాన్ని కోన రఘుపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు ఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చడని ప్రజలు అందరూ రాబోయే రోజుల్లో



సంక్షేమ పుస్తకాలు పంపిణీ చేస్తున్న బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

గుర్తుపెట్టుకోవాలని అన్నారు. మాజీ ఎంపీటీసీ ప్రస్తుత చింతాపాలెం వైసీపీ ఇన్‌ఛార్జి మరక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రూ.1,70,000తో నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, ఆయనకు అభినందనలు తెలిపారు. ఒక చింతాపాలెం గ్రామానికి 7 కోట్ల రూపాయలు అయ్యే అభివృద్ధి కార్యక్రమాలకు పథకాల కింద నగదు కేటాయించిచమన్నారు. అనంతరం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ యారం వనజ, ఉపాధ్యక్షులు పి సుబ్బారావు, మండల కన్వీనర్ సీతారామరెడ్డి, ఉప సర్పంచ్ తోట దివ్యశ్రీ, ఎంపీటీసీలు రాధంశెట్టి లక్ష్మణ్, తాండ్ర సాంబశివరావు, షేక్ ఆసిఫ్ అలీ, నాయకులు మరకా శ్రీనివాసరావు, తోట రమణ, పెరుగు సాంబశివరావు, కాగిత మహేష్, పరమానంద కుమార్, మార్పు బెనర్జీ, సాగర్ అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతులు అధిక దిగుబడులు సాధించాలి

గుంటూరు కమిషనరేట్ ఎడిఎ చంద్రకళ

ప్రజాశక్తి-టంగుటూరు

శనగ రైతులు వ్యవసాయ అధికారుల సూచనలను పాటించి అధిక దిగుబడి సాధించాలని వ్యవసాయశాఖ గుంటూరు కమిషనరేట్ కార్యాలయం సహాయ సంచాలకులు చంద్రకళ తెలిపారు. ఈ క్రాప్ నమోదులో గుంటూరు కమిషనరేట్ కార్యాలయం పరిశీలించిన 29 సర్వే నంబర్లలో నిజ నిర్ధారణ కమిటీ పరిశీలన నిమిత్తం మండల పరిధిలోని తూర్పునాయుడుపాలెం గ్రామాన్ని వ్యవసాయాధికారులు ఎంపిక చేశారు. అందులో భాగంగా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం తూర్పునాయుడుపాలెం గ్రామానికి విచ్చేశారు. శనగ పంట సాగులో సూపర్ చెక్ కమిటీ పరిశీలనలో భాగంగా ఈ పంట నమోదు చేసిన రైతులతో అధికారులు క్షేత్రస్థాయిలో చర్చించారు, ఏ ఏ సర్వే నెంబర్లలో ఎన్ని ఎకరాలు శనగ పంట సాగు చేశారో రైతులను ప్రత్యక్షంగా అడిగి



శనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

తెలుసుకుని ఈ పంట నమోదు చేసిన రికార్డులలో సదరు రైతులు చెప్పిన అంశాలను వ్యవసాయ అధికారులు క్రాస్ చెక్ చేశారు. ఈ సందర్భంగా ఎడిఎ చంద్రకళ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అధికారులు, క్షేత్రస్థాయి సచివాలయాల సిబ్బంది రైతుల పంటల సాగు వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసి ప్రభుత్వం ద్వారా చేకూరే అన్ని ప్రయోజనాలను రైతులకు అందేలా కషి చేయాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆర్‌బికెలోని యూరియా, ఎరువులు బుకింగ్, పెస్టిసైడ్స్, ఆక్వా ఫీడ్ బుకింగ్ కోసం నిర్దేశించిన డిజిటల్ కియోస్క్ యంత్రాన్ని చంద్రకళ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం సాంకేతిక వ్యవసాయ అధికారి రాధా రాణి, టంగుటూరు ఎఒ స్వర్ణలత, గ్రామ వ్యవసాయ సహాయకులు ఎల్ ప్రైసీ రిమాల్, విఆర్‌ఒ రాజేశ్వరి, సర్వేయర్ శ్రీనివాస్, సచివాలయ, రైతు భరోసా కేంద్రంసిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు,.

వ్యవసాయ కార్మిక సంఘం జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

కలకత్తాలో నిర్వహిస్తున్న అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలు విజయ వంతం కావాలని కోరుతూ హను మంతుని పాడులో మంగళవారం జెండాను ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆల్ ఇండియా 10వ మహాసభలు కలకత్తాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభల్లో వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, వివాదా సామాజిక తరగతులు ప్రజా సమస్యలపై చర్చినున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవసాయ కూలీల పట్ల వివక్షత



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రదర్శిస్తుందని తెలిపారు. మత వివక్షతను, కుల వివక్షతను, సామాజిక అసమానతలను పెంచి పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ అధ్యక్షుడు పోతురాజు మంగయ్య, సభ్యులు గురునాథం, రాములు, ఏలియా, కత్తి ఏబు, రమేష్, రాజేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

సైకో ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి : గూడూరి

ప్రజాశక్తి - యర్రగొండపాలెం

రాష్ట్రంలో ఆరాచక పాలన సాగిస్తున్న వైసిపి సైకో ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్ బాబు తెలిపారు. యర్రగొండపాలెంలోని శివాలయం వీధిలో ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు సైతం సక్రమంగా జరగక అన్నదాతలు ఇబ్బంది పడుతున్నా జగన్ ప్రభుత్వానికి పట్టకపోవడం శోచ నీయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ మస్తాన్ వలి, మంత్రునాయక్, పయ్యావుల ప్రసాద్, యూసుఫ్, కాకర్ల కోటయ్య, శనగా నారాయణరెడ్డి, సత్యనారాయణ గౌడ్, కామేపల్లి వెంకటేశ్వర్లు, కొత్తమాసు సుబ్రమణ్యం, పెరుమాళ్ళ మల్లికార్జున, ఆడుసుమల్లి రామ చంద్రరావు, రామకష్ణ, చిట్యాల వెంగళరెడ్డి, మహిళ నాయకురాలు రవణమ్మ, గురిజేపల్లి జిలాని, షేక్ వలి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గూడూరి ఎరిక్షన్‌బాబు

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

పని అడిగే ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని ఎంపిడిఒ తోట చందన అధికారులకు సూచించారు. మండల పరిధిలోని భూపతిపల్లె నిర్వహిస్తున్న పూడికతీత పనులను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ పని ప్రదేశంలో అధికారులు కల్పిస్తున్న సౌకర్యాల గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఎంత మంది కూలీలకు పని కల్పిస్తున్నారు ? ఇప్పటి వరకు ఎన్ని రోజులు పని పూర్తి చేశారు ? కూలీలకు ఎంత డబ్బులు వచ్చాయి తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల సంఖ్య పెంచాలన్నారు. ప్రతిరోజూ రూ.257 కూలి వచ్చే విధంగా పనులు కల్పించాలని ఎపిఒ బి.జీవరత్నంను ఆదేశించారు. ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకూ ఉపాధి హామీ పని చేయాలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇసి, టిఎలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

జరుగుమల్లి.: మండల పరిధిలోని చింతలపాలెంలో ఉపాధి హామీ పథకం ద్వారా నీటికుంటలో చేపట్టిన పూడిక తీత పనులను ఎంపిడిఒ పి.రామకృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ ఉపాధి పనులకు కూలీలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా చూడాలన్నారు. రోజువారీ కూలి రూ.257 గిట్టుబాటు అయ్యేలా పనులు కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం జరుగుమల్లి విజయనగరం కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం పాఠశాల సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీచేశారు. చిన్నారులకు పోషకాహారం, మధ్యాహ్న భోజనం సకాలం అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామ్మోహనరావు పాల్గొన్నారు.



జరుగుమల్లిలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

కాలువలు శుభ్రంగా ఉంచాలి : కమిషనర్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

పారిశుధ్య కార్మికులు ప్రతిరోజూ తమ పరిధిలోని మురుగు కాల్వలను శుభ్రంగా ఉంచాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు తెలిపారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా 16వ డివిజన్ పోతురాజుపాలెం సచివాలయం పరిధిలో కమిషనర్ మంగళవారం పర్యటించారు. ఆప్రాంతంలో రోడ్లు, కాలువలు శుభ్రంగా లేకపోవడాన్ని గమనించిన కమిషనర్ వెంటనే సంబంధిత శానిటరి మేస్త్రీకి నోటీసు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతిరోజూ ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ తప్పని సరిగా చేయాలని సిబ్బందికి సూచించారు. చెత్త సేకరణ ఆటోలు వెళ్లలేని చోట తోపుడు బండ్లు తీసుకు వెళ్లి చెత్త సేకరించాలన్నారు. డ్రైనేజీ శుభ్రతపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. మురుగునీరు నిల్వ ఉన్న కుంటలలో ఆయిల్ బాల్స్ వదలాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట స్థానిక కార్పొరేటర్ శ్రీరామ నాగభూషణం, శానిటేషన్, సచివాలయ సిబ్బంది ఉన్నారు. అనంతరం పోతురాజుపాలెం సచివాలయం పరిధిలో పన్ను బకాయిదారులతో కమిషనర్ నేరుగా మాట్లాడారు. వెంటనే పన్నులు చెల్లించాలని కోరారు. అనంతరం బాలాజీనగర్ మున్సిపల్ పాఠశాలను కమిషనర్ సందర్శించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పంపై విద్యార్థు లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాశం కులాయిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే స్వామి

'పాశం'కు ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండకు చెందిన టిడిపి నాయకుడు పాశం కులాయి ఇటీవల అనార్యోగానికి గురయ్యాడు. ఒంగోలు హాస్పిటల్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి మంగళవారం కులాయి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన ఆర్యోగ పరిస్థితి గురించి ఆరా తీశాడు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కూనపురెడ్డి వెంకటసుబ్బారావు, ఇమ్మడిశెట్టి రామారావు, కాకా శ్రీనివాసరావు, షేక్ అబ్దుల్ సుబాహాన్ ,షేక్ యస్‌ధాని, కనిగిరి వెంకటేశ్వర్లు , కళ్లగుంట నరసింహ, పసుపులేటి శేషు , శీలం సుబ్రహ్మణ్యం, వార్డు సభ్యులు ఓలేటి రవిశంకర్ రెడ్డి , మేకల నరేష్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే మనుగడ

ప్రజాశక్తి మద్దిపాడు

మొక్కల పెంపకతోనే మానవుని మనుగడ సాధ్యమవుతుందని టిడిపి మండల అధ్యక్షుడు మండవ జయంత్ బాబు తెలిపారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని అన్నంగి గ్రామంలో మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జయంత్ బాబు మొక్కలు పెంపకం ద్వారా ఆక్సిజన్ సమద్ధిగా అందుతుందని తెలిపారు. ప్రతి టిడదిపి కార్యకర్త మొక్కలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి ముత్తనపల్లి రామలింగయ్య, నాయకులు మండవ గోపీనాథ్, మండవ రత్నాకర్, వడ్డంపుడి శ్రీనివాసరావు, నారిపెద్ది అనిల్ కుమార్, కొమ్మి కష్ణయ్య, రామకష్ణ, దేవ బత్తిన ప్రసాద్, రావి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్యకు ఘన నివాళి

దర్శి : ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య సేవలు మరువలేనివని దళిత ప్రజాసంఘాల నాయకులు గర్నెపూడి ప్రేమ్‌కుమార్, జూపల్లి కోటేశ్వర రావు తెలిపారు. దామోదర సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రేమ్‌కుమార్, జూపల్లి కోటేశ్వరరావు మాట్లాడుతూ దామోదర సంజీవయ్య ఉమ్మడి రాష్ట్రాల దళిత ముఖ్యమంత్రిగా అనేక సేవలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతవరం మాజీ సర్పంచి కె. నాగేంద్రం, నాయకులు బాబూరావు, కనకరావు, మార్కు, సర్జన్ తదితరులు పాల్గొన్నారు.

జరుగుమల్లిలో 'తోటబడి'

ప్రజాశక్తి, జరుగుమల్లి

జరుగుమల్లిలో మామిడి రైతులతో తోటబడి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యానవన శాఖాధికారి ప్రత్యూష ట్లాడుతూ మామిడిలో సాగుపై రైతులు పలు సూచనలు చేశారు. బోరాన్ లోపం వున్న మామిడి తోటలలో పూత బాగా వచ్చినప్పటికీ ఫలదీకరణ జరగక పోవడం వల్ల పిందె రాలిపోతుందని తెలిపారు. బోరాన్ నివారకు 2 గ్రాముల బోరాక్స్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పూత దశలో 1.5 గ్రాములు జింక్ సల్ఫేట్, బోరాన్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. తేనే మంచు, తామర పురుగు నివారణకు ఇమిడాక్లోప్రిడ్ లేదా అసిఫేట్ 1.5 గ్రాముల, 1 గ్రాముఎంఎల్ డిఫిన్‌కోన్‌జోల్ పిచికారీ చేయాలన్నారు. మామిడి కాయలు నిమ్మకాయ సైజుకి వచ్చినప్పుడు యూరియా స్ప్రే చేయాలన్నారు. అనంతరం జరుగుమల్లి, కె.బిట్రగుంట గ్రామాలలోని మామిడి తోటలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మామిడి తోటల రైతులు వంశీ, శ్రీను, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్య ప్రయోజనాలు


టంగుటూరులో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


మార్కాపురంలో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రతిరోజూ సైకిల్ తొక్కడం వల్ల ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ప్రసాద్ బాబు, డాక్టర్ బాలాజీ అశోక్ తెలిపారు. ఆరోగ్య మేళా కార్యాక్రమంలో భాగంగా స్థానిక శ్రీనివాస నగర్, ప్రభుత్వ హైస్కూల్ ప్రాంతాలలో సైకిల్ తొక్కడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ ప్రతిరోజూ సైకిల్ తొక్కడం వల్ల కేన్సర్, జ గుండెజబ్బుల ద్వారా సంభవించే మరణాలను అరికట్టవచ్చని చెప్పారు. ఆదేవిధంగా శారీరక బరువు, రక్తపోటును నియంత్రించ వచ్చునని తెలిపారు. ఒత్తిడిని అధిగమించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌సి సిహెచ్‌ఒ వెంకటేశులు, హెల్త్ విజిటర్లు పెంచలమ్మ, ఝాన్సీ లక్ష్మి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **మద్దిపాడు :** సైకిల్ తొక్కడం వల్ల ఆర్యోగంగా జీవించవచ్చునని మద్దిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మానస తెలిపారు. ఆరోగ్య మేళా కార్యక్రమంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ సైకిల్ తొక్కడం వదల కేన్సర్, మధుమేహం లాంటి వ్యాధులను నివారించుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ వెంకరెడ్డి, సిహెచ్ఇఒ లలితమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ బాలకోటయ్య, నాగేశ్వరావు, ఎఎన్ఎం సుభాషిణి, ఆశా కార్యకర్తలు అక్కమ్మ, రత్నకుమారి, భవాని, ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. **సంతనూతలపాడు రూరల్ :** నడక మరియు సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి మంచిదని మండల పరిధిలోని వేములపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మక్కెన సుమన్‌కుమార్ తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేన్సన్ వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ రమణమ్మ, హెచ్ఇఒలు మోహనరావు, జి.నాగేశ్వరరావు, పర్యవేక్షకులు సిహెచ్.శ్రీనివాసులు,షేక్ మస్తాన్‌బి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **పామూరు :** కేన్సర్ వ్యాధిపై అందరూ అవగాహన కలిగిఉండాలని ఎంపిడిఒ తెలిపారు. శ్రీనివాసులు తెలిపారు. కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తూ సచివాలయ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో డాక్టర్లు, ఆశా వర్కర్లు, ఎఎన ్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **మార్కాపురం రూరల్ :** సైకిల్ తొక్కడం ద్వారా ఆరోగ్యంగా జీవించ వచ్చునని మార్కాపురం జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. రాహుల్ తెలిపారు. హెల్త్ మేళా కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆరోగ్యం కోసం సైక్లింగ్ అనే నినాదంతో సైకిల్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ సైక్లింగ్ మంచివ్యాయామమని తెలిపారు. ప్రతి రోజు గంట సేపు సైకిల్ తొక్కడం ద్వారా 400 నుంచి 750 క్యాలరీలు కరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిహెచ్.రాజశేఖర్, డాక్టర్. దీపిక మంజూష, మల్టీ పర్పస్ హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ బి. శ్రీకాంత్, ఆర్. నాగేంద్ర రెడ్డి, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆషా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **యర్రగొండపాలెం :** కేన్సర్ వ్యాధిపై అవగాహన పెంచుకుంటే నివారణ సాధ్యమని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.రేణుక తెలిపారు. వెంకటాద్రిపాలెం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ కోటా నాయక్, డాక్టర్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రేణుక మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి రాకుండా ఉండేందుకు మంచి ఆరోగ్య అలవాట్లు పాటించాలన్నారు. సిగరెట్, గుట్కాలు, పాన్ పరాగ్‌కు దూరంగా ఉండాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ స్వప్న మాట్లాడుతూ సైక్లింగ్ తొక్కడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒలు స్వప్న, మేరి మిల్కమ్మ, హెచ్ఇఒ హృదయరంజన్, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, పద్మావతి, వీరమ్మ, ఆశా కార్యకర్తలు రవణమ్మ, లక్ష్మీకుమారి, జయ పాల్గొన్నారు. **ముండ్లమూరు :** కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తూ వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు డాక్టర్ జ్యోతి, డాక్టర్ మల్లేల జాస్మిన్ మాట్లాడుతూ కేన్సర్ నివారణకు ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సైకిల్ తొక్కడం వలన శరీరంలోని అవయవాలు అన్నీ కదలి బాగా రక్త ప్రసరణ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది , పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు. **పెద్దదోర్నాల :** మండల పరిధిలోని చింతల , కొర్రప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారుల ఆధ్వర్యంలో కేన్సర్ వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తూ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సైక్లింగ్, యోగ వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శంకర్ రెడ్డి, డాక్టర్ యాగ్నిక్, డాక్టర్ కళ్యాణి, గవర్నమెంట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ సెక్రటరీ పీ.మోహన్ రావు , వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ క్లినిక్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య మిత్రలు, ఆశా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ

ముండ్లమూరు : ముండ్లమూరు అంబేద్కర్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి రామ్మోహనరావు మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లలకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రామాంజనేయులు, సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్త మంజులవాణి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వైద్యపరీక్షలు

ప్రజాశక్తి -పొదిలి

చిన్నారుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిడిపిఒ సుధా మారుతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శిశు సంక్షేమ ప్రాజెక్టు అధికారుల ఆధ్వర్యంలో చిన్నారులకు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల సందర్శన

ప్రజాశక్తి-పెద్దారవీడు

టూర్ డైరీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తోకపల్లి, బోయదగుంపుల, చట్లమిట్ట రైతు భరోసా కేంద్రాలను వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు తనిఖీ చేశారు. సూపర్ చెకింగ్‌లో బాగంగా విలేజ్ టీమ్‌తో కలిసి పొలాలను తనిఖీ చేశారు. అనంతరం ఎఒ కె.బుజ్జిబాయి మాట్లాడుతూ మండల పరిధిలోని రైతులందరూ ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. అదేవిధంగా ఇకెవైసి చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆఒలు, సర్వేయర్‌లు, వ్యవసాయ సహాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వైసిపి సోషల్ మీడియా నియోజకవర్గ కో కన్వీనర్‌గా ఖాసింబాషా

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైసిపి సోషల్ మీడియా నియోజక వర్గ కో కన్వీనర్‌గా యర్రగొండపాలెం పట్టణానికి చెందిన షేక్ ఖాసింబాషాను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రకటించారు. షేక్ ఖాసింబాషా వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. యువతలోనూ, పార్టీ క్యాడర్‌లోనూ మంచి సంబంధాలు నిర్వహిస్తూ మంత్రి సురేష్‌కు ప్రియ శిషునిగా దగ్గరయ్యారు. ఈ సందర్భంగా షేక్ ఖాసింబాషా మాట్లాడుతూ పార్టీ తనపై పెట్టిన బాధ్యతను తూచ తప్పకుండా నిర్వహించి యర్రగొండపాలెం నియోజకవర్గంలో మంత్రి సురేష్‌తో పాటు రాష్ట్రంలో జగనన్న తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు తన శాయ శక్తులా కృషి చేస్తానని తెలిపారు.

ఆర్‌టిసి స్థలం పరిశీలన

పెద్ద దోర్నాల : దోర్నాలలో అన్ని హంగులతో ఆర్‌టిసి బస్టాండ్‌ను నిర్మిస్తామని ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు తెలిపారు. దోర్నాలలోని ఆర్‌టిసి బస్టాండ్ స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ ఆర్‌అండ్‌బి స్థలంలో 51 సెంట్లను స్వాధీనం చేసుకొని అన్ని వసతులతో బస్టాండ్ నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈడీ బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు ఆర్ఎం సుధాకర్, మార్కాపురం డిఎం నరసింహులు, నాయకులు తంగిరాల రామిరెడ్డి, గంటా గురవారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఇఒ తనిఖీ

యర్రగొండపాలెం : మండల పరిధిలోని సర్వాయిపాలెం ఎంపిపిఎస్ పాఠశాలను ఎంఇఒ ఆంజనేయులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సంద్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు మెరుగైన సామర్థ్యాలు సాధించేలా చూడాలని, వర్క్ బుక్స్‌ను కూడా రాయించి వాటిని సరిదిద్దాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని వెల్ఫేర్ అసిస్టెంట్ , సిఆర్‌పిలతో కలిసి రుచి చూశాడు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఇందిర, గీతాంజలి, సిఆర్‌పి శ్రీను, ఉపాధ్యాయులు రజనీ ప్రియ, భార్గవి, ఖాసిం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు .

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఆరో అదనపు జడ్జి రాజా వెంకటాద్రి


జడ్జిని సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

మార్కాపురం : విద్యార్థులు చదువుకునే వయసులో సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే జీవితంలో ఉన్నతంగా స్థిరపడవచ్చునని మార్కాపురం ఆరో అదనపు జిల్లా జడ్జి టి.రాజా వెంకటాద్రి తెలిపారు. స్థానిక డాక్టర్ శామ్యూల్ జార్జి ఫార్మసీ కళాశాలలో ప్రెషర్స్ డే వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి రాజా వెంకటాద్రి మాట్లాడుతూ చదువుకునే సమమయంలో నిర్లక్ష్యం చేస్తే జీవితంలో ఉన్నత స్థానంలో నిలవడం కష్టమన్నారు. చదువుతో సమానత్వం పెరుగుతుందన్నారు. అందరూ కష్టపడి చదువుల్లో రాణించాలన్నారు. ఉన్నతంగా స్థిరపడిన తరువాత సమాజంలో సేవా కార్యక్రమాలు చేయాలని సూచించారు. జార్జి ఫార్మసీ కళాశాలలో చదివి ఉన్నతంగా స్థిరపడిన ఫార్మసీ విజిలెన్స్ రీసెర్చ్ అసోసియేట్ కె.విద్యాసాగర్ మాట్లాడుతూ జార్జి కళాశాలలో చదివిన విద్యార్థులు ఎందరో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. అందులో తానొకడినని గర్వంగా చెప్పారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ జోలికి వెళ్లకుండా చక్కగా చదువుకోవాలన్నారు. సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. అనంతరం అతిథులను సత్కరించారు.

రేషన్ సరుకులు ఇవ్వడం లేదని ఫిర్యాదు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ప్రతి నెలా రేషన్ డీలరు సర్వర్ లేదని చెప్పి తనకు రేషన్ ఇవ్వడం లేదని, ఈ-పాస్ ఆన్‌లైన్‌లో మాత్రం తన రేషన్ కార్డుకు బియ్యం సరఫరా చేసినట్లు చూపిస్తుందని మండల పరిధిలోని గొట్టిపడియ గ్రామానికి చెందిన వృద్ధుడు బొచ్చు వెంకటేశ్వర్లు వాపోతున్నాడు. ఈ మేరకు ఉప తహశీల్దారు షేక్ పర్వీన్‌కు మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా బాధితుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనకు 2819188064 నంబరు పేరుతో రేషన్ కార్డు ఉన్నట్లు తెలిపాడు. తమది ముంపు గ్రామం కావడంతో నెట్‌వర్క్ లేకి కారణంతో ఆఫ్‌లైన్ బియ్యం, నిత్యవసర సరకులు సరఫరా చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నట్లు తెలిపాడు. అయితే రేషన్ డీలర్ అన్‌లైన్ రావటం లేదని, తన వేలిముద్రలు పడటం లేదని సాకు చూపి ప్రతి నెల బియ్యం ఇవ్వటం లేదని వాపోయాడు. అయితే ఈ-పాస్‌లో తాను రేషన్ తీసుకున్నట్లు చూపిస్తున్నట్లు తెలిపాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపైచర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశాడు.

కంటి ఆపరేషన్లకు తరలింపు

ప్రజాశక్తి-మార్కాపురం

టిడిపి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యశిబిరంలో 150 మందికి కంటి శస్త్ర చికిత్స అవసరమని వైద్యులు గుర్తించారు. వారిని ప్రత్యేక బస్సుల్లో కంటి ఆపరేషన్ల నిమిత్తం మంగళవారం తరలించారు. జెండా ఊపి మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి బస్సులను ప్రారంభించారు. ఉచిత ప్రయాణం, భోజన వసతి, ఉచితంగా కంటి ఆపరేషన్‌లు చేయించేందుకు చొరవ చూపిన మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి ఈ సందర్భంగా పలువురు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, పట్టణ ప్రధాన కార్యదర్శి కొప్పుల శ్రీనివాసులు, టిడిపి ఒంగోలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బమ్మకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని నేతివారిపాలెం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు నువ్వుల కోటయ్య భార్య సుబ్బమ్మ మంగళవారం మృతిచెందింది. ఆమె మృతదేహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, టిడిపి నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు తదితరులు సందర్శించి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో టిడిపి ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి రామయ్యచౌదరి, టిడిపి మండల అధ్యక్షుడు బొడ్డపాటి యలమందనాయుడు, బత్తుల నారాయణస్వామి, దామా మురళి, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

సైకిల్ తొక్కడం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-బాపట్ల

బాల బాలికలు ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు విద్యార్థి దశ నుంచే సైకిల్ తొక్కడం అలవర్చుకోవాలని బాపట్ల మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్ అన్నారు. మంగళవారం బాపట్ల మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఆయుష్మాన్ భారత్ బ్లాక్ లెవెల్ హెల్త్ మేళా సైకిల్ ఫర్ హెల్త్ సైకిల్ ర్యాలీని భానుప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య పరిరక్షణకు ఉదయం, సాయంత్రం సమయాల్లో చదువుతోపాటు, నడక, వ్యాయామం, సైకిల్ తొక్కడం అలవాటు చేసుకొని శక్తివంతమైన ఆరోగ్యం, చురుకైన శరీరం, పదునైన ఆలోచనలతో చదువుల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. ప్రధానంగా విద్యార్థులు సమయపాలన పాటిస్తూ, ఏకాగ్రతతో విద్యపై దృష్టి సమయానికి ఆహార నియమాలు పాటిస్తూ పిన్న వయస్సు నుంచే అనారోగ్య రుగ్మతలు దరిచేరకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకునేందుకు సైకిల్ తొక్కడం వంటి ప్రక్రియ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో వయోభేదం లేకుండా ప్రతి ఒక్కరూ సైకిల్ వినియోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ హైస్కూల్ పిఈటి కత్తి శ్రీనివాస రావు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

అద్దంకి: సైకిల్ తొక్కటం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని మోదేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైధ్యాధికారి ఎన్ జయచంద్రరావు అన్నారు. మంగళవారం మోదేపల్లి ఆరోగ్య కేంద్ర సిబ్బంది, తిమ్మాయపాలెం పాఠశాల విద్యార్థులు సంయుక్తంగా కాకానిపాలెం హెల్త్ సెంటర్ నుంచి భవాని సెంటర్ మీదుగా బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జయచంద్ర మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా చిన్న వయసు నుంచే షుగర్, బీపీ, కీళ్లనొప్పులు, గుండె సంబంధిత వ్యాధులు మనిషిపై దాడి చేస్తున్నాయన్నారు. ఇందుకు మనిషి జీవన శైలిలో వచ్చిన మార్పులే ప్రధాన కారణమని అన్నారు. ప్రతిరోజూ వ్యాయామంతో బాటు సైకిల్ తొక్కడం ద్వారా వ్యాధులకు దూరం కావచ్చని అన్నారు. ప్రధానంగా సైకిల్ తొక్కడం ద్వారా చర్మం ఆరోగ్యంగా ఉండటంతో బాటు జ్ఞాపకశక్తి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అద్దంకి సీఐ రోశయ్య, డాక్టర్స్ హకీం, గొట్టిపాటి జయసింహ, కొరిశపాడు డాక్టర్స్ అఖిలేష్, జయశ్రీ, ఆరోగ్య విస్తరణధికారులు రామకోటేశ్వరావు, నాగేశ్వరావు, తిమ్మాయపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, 150 మంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు: ప్రతిరోజూ సైకిల్ తొక్కడం వల్ల అనేక



పంగులూరులో..



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ భాను ప్రతాప్

వ్యాధులు దూరం కావడంతో పాటు, మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉండవచ్చునని, పంగులూరు మండల ప్రాథమిక వైద్యశాల వైద్యులు రావి మల్లికార్జునరావు అన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ మేళా, సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని 21 గ్రామాల్లో ఉన్న, 14 సచివాలయాల దగ్గర మంగళవారం కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సైకిల్ ర్యాలీని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ, క్యాన్సరు, బిపి, షుగర్, వంటి వ్యాధులను సైకిల్ తొక్కడం వల్ల కంట్రోల్ చేయవచ్చు అన్నారు. మనిషి మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉండేందుకు అధిక బరువును తగ్గించుకొని ఆరోగ్యకరమైన బరువు ఉండటానికి సైకిల్ ఎంతో ఉపయోగపడుతుం దన్నారు. సైకిల్ తొక్కటం వల్ల ఎముకలు దృఢంగా ఉండటంతో పాటు, కండరాలు బలంగా ఉంటాయని, ఒత్తిడి తగ్గించుకోవడానికి కూడా సైక్లింగ్ ఉపయోగపడుతుందని అన్నారు. సైకిల్ తొక్కడం వల్ల మంచి నిద్ర పట్టడంతో పాటు, అధికమైన కేలరీలు ఖర్చు అవుతాయని, టీబీ, లెప్రసీ, క్యాన్సర్ పేషెంట్లు కూడా సైకిల్ తొక్కవచ్చని చెప్పారు. మంచి ఆహార పదార్థాలు తీసుకోవడంతో పాటు, ధూమ పానం, మద్యానికి దూరంగా ఉండాలన్నారు. రన్నింగ్, వాకింగ్, సైక్లింగ్, యోగ, మెడిటేషన్ చేయటం ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని, ఆహార నియమాలు పాటించాలని, ఇంటి పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివ చెన్నయ్య, ఆయుర్వేద వైద్యులు కృష్ణకుమార్, సిహెచ్ఓ భారతి, పిహెచ్ఎన్ రాణి కుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ అనురాధ, సూపర్‌వైజర్లు మదార్‌షా, వెంకాయమ్మ, రమాదేవి, ఫార్మసిస్ట్ పద్మావతి, ఆరోగ్య కార్యకర్తలు రాధ, సతీష్ కుమార్, ఏఎన్ఎంలు, ఆశాలు, టీచర్లు, సెక్రటరీలు పాల్గొన్నారు.

కారంచేడు: మండలంలోని కారంచేడు, ప్రభుత్వ వైద్యశాల వద్ద, స్వర్ణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని స్వర్ణ, జరుబులవారిపాలెం, కొడవలివారి పాలెంలలో ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా సైకిల్ ఫర్ ఎలెక్ట్ అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ



ఇంకొల్లు మండలం పూసపాడులో..



ర్యాలీలో పాల్గొన్న మోదపల్లి ప్రభుత్వ వైద్యాధికారి నూకతోటి జయచంద్రరావు

కార్యక్రమంలో విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది ఆరోగ్య సూత్రాలపై నినాదాలు చేస్తూ సైకిల్ తొక్కుతూ ప్రజలకి అవగాహన కల్పించారు. సైకిల్ తొక్కడం వలన ఆరోగ్యానికి సంబంధించి అధిక బరువును, నియంత్రిస్తుందని, బీపీ షుగర్ లాంటివి అదుపులో ఉంటాయని, రోగనిరోధక శక్తి పెరుగుతుందని వైద్యులు అన్నారు. అలాగే ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయని, గుండె జబ్బులు రాకుండా, మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది శరీర కండరాలు దృఢంగా తయారవుతాయని అవగాహన కల్పించారు. గ్రామంలో ర్యాలీ చేస్తూ ఆరోగ్యమే మహాభాగ్యమని, అందరూ ఆరోగ్య సూత్రాన్ని పాటించాలని అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి ఎం శాలిని, జడ్‌పిహెచ్ఎస్ హెచ్ఎం కే హనోరా, కారంచేడు మెడికల్ ఆఫీసర్ జెస్సి, వైద్య సిబ్బంది శాంతి ప్రియ, జయశ్రీ, రాణి, హెచ్ఈ మీనాకుమారి ఎల్‌టి బయ్యాశంకర్, ఉపాధ్యాయులు భవాని ప్రసాద్, ఏఎల్‌కె ప్రసాద్, పిడికె ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పిలు అశ్విని, అనూష, నూర్జహాన్, ఏఎన్ఎంలు నాగలక్ష్మి సౌజన్య అరుణ, దేవమణెమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్: ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఇంకొల్లు మండలం పూసపాడు, ఇంకొల్లులో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి అంజలిదేవి క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పించారు. యోగాపై అవగాహన కల్పించారు. సైకిల్‌పై ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె శ్రీనివాసరావు, వి ఉదయకుమారి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కోటేశ్వరరావు, పిహెచ్ఎన్ సహస్ర, సూపర్‌వైజర్లు, ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతమాగులూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారంగా, ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా బుధవారం మండల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, మరియు కార్యకర్తలు సైకిల్ ఫర్ హెల్త్ అనే వినాదంతో మెగా సైక్లోదాన్ ఈవెంట్‌ను ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, సైక్లింగ్ చేయడం వలన కండరాలు బలపడతాయని, శరీరంలో అధిక క్యాలరీలు తగ్గించుకోవచ్చని, రక్తపోటును నియంత్రిస్తూ గుండె ఆరోగ్యం పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం జరిగిన హెల్త్ మేళాలో బిపి, షుగర్, మధుమేహం, క్యాన్సర్‌పై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి, ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడిలను జనరేట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం సాంబశివరావు, వైద్యాధికారులు నిర్మల్ కుమార్, సాహితి, ప్రసన్న కుమారి, రామకోటమ్మ, హెల్త్ సూపర్ వైజర్‌లు పాల్గొన్నారు.

పుల్వామా అమర జవాన్లకు నివాళి

ప్రజాశక్తి-బాపట్ల

జమ్మూకాశ్మీర్ రాష్ట్రం పుల్వామా జిల్లా భారత్-పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతంలో 2019 ఫిబ్రవరి 14న జరిగిన ఉగ్రవాదులు బాంబు పేలుళ్ల దాడిలో అశువులు బాసిన అమర జవానులకు బాపట్ల మాజీ సైనిక సంక్షేమ సంఘం నివాళులర్పించింది. మంగళవారం బాపట్ల పట్టణం విజయలక్ష్మి పురంలో మాజీ సైనిక సంక్షేమ సంఘం కార్యాలయంలో అమర జవానుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. బాంబు పేలుళ్ల సంఘటనలో అసువులు బాసిన వీర జవానుల ఆత్మకు శాంతి కలగాలని, అమరులైన జవానులకు జోహారులర్పించారు. భారత జవాన్ల త్యాగాలను స్మరిస్తూ పట్టణ ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాపట్ల నియోజకవర్గ మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు,



బాపట్లలో అమర జవానుల త్యాగాలనుస్మరిస్తూ ర్యాలీ

నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యులు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ దేశ ప్రజలు ఫిబ్రవరి 14న బ్లాక్ డేగా గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సెక్రెటరీ తోట దుర్గారావు, సీనియర్ మాజీ సైనికులు జెట్టి జోసెఫ్, పెద్ద సంఖ్యలో మాజీ సైనికులు పాల్గొన్నారు.

మార్టూరు రూరల్: భారత దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టిన వీర సైనికుల సేవలు చిరస్మరణీయమని రాయల్ విద్యాసంస్థల అధినేత పేరం రవీంద్రబాబు కొనియాడారు. మంగళవారం మండల కేంద్రం మార్టూరులో రాయల్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో పుల్వామా జిల్లాలో 2019 ఫిబ్రవరి 14న జరిగిన ఉగ్ర దాడిలో అశువులు బాసిన వీరసైనికులకు రాయల్ స్కూల్ విద్యార్థులు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పేరం స్వప్న రవీంద్రబాబు, కుడారి మధుబాబు, ప్రధానోపాధ్యాయులు బాలసుబ్రమణ్యం, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొనక రామాంజనేయులుకు మాతృవియోగం

ప్రజాశక్తి-అద్దంకి



పొనకా భాగ్యమ్మ (ఫైల్)

సిపిఎం అద్దంకి మండల సీనియర్ నాయకులు, రైతు సంఘం జిల్లా నాయకులు పొనక రామాంజనేయులు తల్లి పొనక భాగ్యమ్మ(90) వయోభారంతో మంగళవారం మృతి చెందారు. ఇంటికి వచ్చిన కార్యకర్తలను ఆదరించటంలో భాగ్యమ్మ ప్రత్యేక ఆసక్తి చూపేవారు. భాగ్యమ్మ మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య విచారం వ్యక్తం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, సీఐటీయూ నాయకులు తిరుపతిరెడ్డి, విజయకుమార్ తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. చెరువుకొమ్ముపాలెంలో అంత్యక్రియలు బుధవారం ఉదయం నిర్వహించనున్నట్లు పొనక రామాంజనేయులు తెలిపారు.



పోగొట్టుకున్న బంగారు ఆభరణాలు అందిస్తున్న ఎస్ఐ ప్రసాద్

పోగొట్టుకున్న ఆభరణాలు అందజేత

ప్రజాశక్తి-పర్చూరు: పర్చూరుకు చెందిన బట్టల వ్యాపారం చేసుకునే మహిళ బొర్రా మహాలక్ష్మి సోమవారం సాయంత్రం పర్చూరు మెడికల్ షాపులో మందులు కొనుగోలు చేసేందుకు వెళ్లింది. అక్కడ బంగారు నగలు ఉన్న పర్సును పోగొట్టుకుంది. ఇంటికి వెళ్లి చూసుకునేసరికి పర్సు కనిపించకపోవటంతో పర్సుపోయిన సంగతిని గుర్తించి వెంటనే మందుల షాపు వద్దకు వచ్చి విచారించినా ఫలితం లేకపోయింది. వెంటనే పర్చూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎస్సై చెంచు ప్రసాద్ సిసి పుటేజీలను పరిశీలించారు. 70 సంవత్సరాల వృద్ధుడు మందుల షాపులోనే పర్సు తీసుకున్నట్లు గుర్తించారు. వృద్ధుని గురించి పోలీసులు విచారించగా ఉప్పుటూరుకు చెందిన మౌలాలిగా నిర్ధారించారు. వెంటనే ఇంటికి వెళ్లి అతని వద్ద ఉన్న 13 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.12 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆభరణాల విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని ఎస్ఐ వివరించారు. ఆభరణాలను, నగదును బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా మహిళ కృతజ్ఞతలు తెలిపారు. కేసును ఛేదించటంలో చొరవ చూపిన ఎస్ఐ చెంచుప్రసాద్, ఏఎస్ఐ పి కోటేశ్వరరావు, కానిస్టేబుల్ బాలశంకర్‌రావులను ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

నేటి నుంచి సామాజిక తనిఖీలు: ఎంపిడిఒ

ప్రజాశక్తి-నగరం: నగరం మండలంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సామాజిక తనిఖీలు రేపటి నుంచి ఈ నెల 26వ తేదీ వరకు గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ రాధారమణ తెలిపారు. ఎస్ఆర్‌పి చిన్నబ్బాయి నేతృత్వంలో తనఖీ బృందంతో సమన్వయ సమావేశం మంగళవారం జరిగింది. ఈ తనిఖీలు 6 కోట్ల 20 లక్షలు రూపాయలకు సంబంధించినవని తెలిపారు. కార్యక్రమానికి ఎంపీడీవో రాధా రమణ, జిల్లా విజిలెన్స్ అధికారి శోభన్, ఏపీవోలు సత్య కృష్ణ, సురేష్, ఈసీ అరుణ అందరు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, మరియు వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. బుధవారం నుంచి 26వ తేదీ వరకు గ్రామాలలో తనిఖీలు నిర్వహిస్తారని తెలిపారు.

పత్రాలు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు

ప్రజాశక్తి-పర్చూరు: పర్చూరు వై జంక్షన్‌లో ఎస్ఐ చెంచు ప్రసాద్ వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేని, లైసెన్సులు లేని వాహనాలకు పెనాల్టీ వేశారు. అతి వేగం ప్రమాదకరమని, వాహన పత్రాలు లేకుండా వాహనాలు నడిపినా, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

హక్కులు సాధించుకోవాలంటే

మీగడ వెంకటేశ్వరరెడ్డిని గెలిపించుకోవాలి

యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కారుసాల సుబ్బారావమ్మ


మాట్లాడుతున్న కారుసాల సుబ్బారావమ్మ

ప్రజాశక్తి-చీరాల

ఔట్‌సోర్సింగ్ కార్మికులు, స్కీం వర్కర్ల హక్కులను సాధించుకొని.. సమస్యలను పరిష్కరించుకోవాలంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డిని అందరం ఐక్యంగా గెలిపించుకోవాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కారుసాల సుబ్బారావమ్మ అన్నారు. మంగళవారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)సమావేశం చీరాల, అద్దంకి పర్చూరు నియోజకవర్గాల అంగన్వాడీ బాధ్యుల సమావేశం చీరాల సిఐటియు కార్యాలయంలో జరిగింది. సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షురాలు ప్రమీల అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కారుసాల సుబ్బారావమ్మ మాట్లాడుతూ పిడిఎఫ్ ఎమ్మెల్సీలు గతంలో కూడా రాష్ట్రంలోని అధ్యాపక, ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్, కార్మికుల, కష్టజీవుల వాణిని శాసన మండలిలో శక్తివంతంగా వినిపించారన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి పి ఎలిజిబెత్ రేఖ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వెంకటేశ్వరరెడ్డి గెలుపునకు కషి చేద్దామని చెప్పారు. ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.మజుందర్, నాయకులు ఎం.వసంతరావు, ఎ.బ్యూలా, జి.సుజీవన, వై.అనిత లక్ష్మి పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన తప్పనిసరి

డాక్టర్ బాబూరావు


మాట్లాడుతున్న డాక్టర్ బాబూరావు

ప్రజాశక్తి-చీరాల

క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, తద్వారా క్యాన్సర్ నివారణ సాధ్యమవుతుందని రోటరీ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో యార్లగడ్డ అన్నపూర్ణమ్మ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో క్యాన్సర్ వ్యాధిపై బాలికలకు ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, గొంతు క్యాన్సర్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, వచ్చిన తరువాత తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ మామియోగ్రాఫి స్క్రీనింగ్ టెస్ట్ చేయించకోవాలన్నారు. ప్రారంభ దశలో గుర్తిస్తే కీమియో థెరపి ద్వారా ట్రీట్మెంట్ చేయవచ్చన్నారు. 40 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళ క్యాన్సర్ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. 70 శాతం రొమ్ము క్యాన్సర్ కేసులు ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బాబూరావు, ప్రిన్సిపాల్ రమణమ్మ, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ట్యాబ్‌ల వినియోగం సక్రమంగా లేకపోవడంతో

ఉపాధ్యాయులపై డిఇఒ ఆగ్రహం


విద్యార్థుల పుస్తకాలు పరిశీలిస్తున్న డిఇఒ రమేష్

ప్రజాశక్తి-కొత్తపట్నం

రాష్ట్ర ప్రభుత్వం నూతన విద్యా విధానంలో భాగంగా 8వ తరగతి విద్యార్థులకు బైజుస్ పాఠ్యాంశాలను వినడానికి ట్యాబ్‌లను పంపిణీ చేసింది. ఉపాధ్యాయుల అలసత్వం వల్ల ట్యాబ్‌ల వినియోగం సక్రమంగా లేదని, అసంతృప్తి వ్యక్తం చేసి.. ఉపాధ్యాయులపై జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులు ట్యాబ్‌ల వినియోగంపై ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిఇఒ పరిశీలనలో సుమారు 75 శాతం మంది మాత్రమే విద్యార్థులు ట్యాబ్‌లు వినియోగిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులపై డిఇఒ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 17న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జిల్లాల్లో పర్యటించనున్నారని, ఉఉపాధ్యాయులు విద్యార్థులను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉందన్నారు. తరగతి గదిలో విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఉపాధ్యాయులు లెసన్ ప్లాన్ తప్పనిసరిగా రాయాలని దానికి అనుగుణంగానే పాఠ్యాంశాలను బోధించాలన్నారు. మోటుమాలలోని కేజీబీవీని సందర్శించి విద్యార్థుల వర్క్‌బుక్‌లను, నోట్ పుస్తకాలను పరిశీలించారు. ఉప విద్యాశాఖాధికారి అనిత రోజ్ మేరీ, ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించి, పనితీరు మెరుగుపరచుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఏ.అజయ్‌బాబు, కొత్తపట్నం హెచ్‌ఎం పి.సుబ్బారావు, కేజీబీవీ కోఆర్డినేటర్ అరుణకుమారి పాల్గొన్నారు.

వ్యాయామంతో శరీర బరువు నియంత్రణ

- డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి
- ఆయుష్మాన్ భారత్ ర్యాలీ ప్రారంభం



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వ్యాయామం చేయటం ద్వారా శరీర బరువును నియంత్రించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ప్రకాశం భవనం వద్ద మంగళవారం ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మేళా ర్యాలీని ఆమె జెండా ఊపి.. ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఒ మాట్లాడుతూ ఆయుష్మాన్ భారత్ ద్వారా ప్రతి నెలా ఒక కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ నెలలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించామన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా బరువు నియంత్రించవచ్చని, అదనపు కేలరీలు ఖర్చు చేయవచ్చని సూచించారు. కండరాలను బలోపేతం చేయడానికి ఇది సహాయపడుతుందన్నారు. ఒత్తిడి నుండి బయటపడేందుకు వ్యాయామం సరైన మార్గమని తెలిపారు. వ్యాయామం చేయడం ద్వారా రక్తపోటు నియంత్రణలో ఉంటుందని, తద్వారా భవిష్యత్తులో గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని నియంత్రించడంలో సహాయపడుతుందని పేర్కొన్నారు. సైక్లింగ్ వల్ల శారీరకంగా దఢంగా ఉండటమే కాకుండా ఉల్లాసంగా ఉంటారన్నారు. రెగ్యులర్ వ్యాయామం మంచి నిద్రకు సహాయపడుతుందని చెప్పారు. రాత్రి నిద్రపోయే ముందు ఎక్కువ వ్యాయామం చేయడం మంచిది కాదన్నారు. కార్యక్రమంలో డిటిసిఒ డాక్టర్ సురేష్‌కుమార్, ఉప వైద్య అధికారి డాక్టర్ మాధవీలత, యన్.సి.డి. నోడల్ అధికారి డాక్టర్ భాగీరథి, డిపిఎంఒ డాక్టర్ టి.వాణిశ్రీ, యు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రము వైద్యాధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆటంకాలు సృష్టించొద్దు

మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్

ప్రజాశక్తి-శింగరాయకొండ

గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని మండల ప్రత్యేక అధికారి చంద్రశేఖర్ రెడ్డి, మండల అభివద్ధి అధికారి షేక్ జమీఉల్లా అన్నారు. మంగళవారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై అభివద్ధి కార్యక్రమాలపై చర్చించారు. శింగరాయకొండ, సోమరాజుపల్లి గ్రామపంచాయతీలో కొంత ఇబ్బందులు జరుగుతున్నాయని, గ్రామపంచాయతీ అధికారులు సర్పంచులతో మాట్లాడి తీర్మానాలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఎక్కడా ఆటంకాలు జరగకూడదని వివరించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ కోట శ్రీహరి, గృహ నిర్మాణశాఖ ఏఈ నాగరాజు, యుఆర్ డి అంజలిదేవి ఉన్నారు.

సూత్రధారులను సిబిఐ బోనులో నిలబెట్టాలి: టిడిపి

ప్రజాశక్తి సంతనూతలపాడు రూరల్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్.జగన్మోహన్ రెడ్డి బాబాయి వైయస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సూత్రధారులు ఎంతటి స్థాయి వారైనా శిక్షించాలని, వారికి శిక్ష పడకపోతే నరహంతకులు విచ్చలవిడిగా రెచ్చిపోతారని టిడిపి మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం సాయంత్రం జగనాసుర రక్త చరిత్ర కరపత్రాన్ని విడుదల చేసి అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యదర్శి వివరం గోవిందయ్య, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి టీ నరసింహారావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, తెలుగు మహిళ మండల అధ్యక్షులు మాధవిలత, పాల్గొన్నారు.

సూపర్‌వైజర్‌కి ఘన సత్కారం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కొత్తపట్నం పిహెచ్‌సి పరిధిలోని మోటుమాల ఎఎన్‌ఎంగా విశేష సేవలందించి ఉద్యోగోన్నతిపై సూపర్‌వైజర్‌గా పెద్దచెర్లోపల్లి వెళుతున్న సప్పరపు రేణుకాదేవిని ఘనంగా సత్కరించారు. ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.శరత్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ మాధవీలత, రూట్ ఆఫీసర్ వాణిశ్రీ కొత్తపట్నం వైపిహెచ్‌సి వైద్యాధికారి వైష్ణవి, ఏఎన్‌ఎం వెంకటేశ్వరమ్మ, ఆశాకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలి

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా అధ్యక్షుడు కొల్లి చెంచురెడ్డి


మాట్లాడుతున్న కొల్లి చెంచురెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం చట్టం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మార్కాపురం తాలూకా అధ్యక్షుడు కొల్లి చెంచు రెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగుల జీతభత్యాలు మార్గదర్శకాలు చట్టబద్ధత అనే అంశాలపై స్థానిక ఆర్అండ్‌బి కార్యాలయ ఆవరణంలో మంగళవారం సాయంత్రం మార్కాపురం తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కొల్లి చెంచురెడ్డి మాట్లాడుతూ ఆర్థిక బకాయిలు చెల్లింపునకు టైం షెడ్యూల్ విడుదల చేయాలన్నారు. అలాగే 11వ పిఆర్‌సిలో ఉన్న అలవెన్స్‌లకు సంబంధించి ఉత్తర్వులు వన్ టైం స్కేల్ ఇంతవరకు ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పూర్తిస్థాయి జీవోలను తక్షణమే విడుదల చేసి ప్రభుత్వ ఉద్యోగస్తులను ఆదుకోవాలన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పూర్వపు గవర్నర్ విశ్వభూషణ్ హరిచంద్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.ఆర్ సూర్య నారాయణ కలవడం తప్పులేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. సమావేశంలో కార్యదర్శి బండి వెంకటేశ్వర్లు, ట్రెజరర్ షేక్ బుడే సాహెబ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమణారెడ్డి నాయకులు పఠాన్ ఇలియాజ్ ఖాన్, మేరీ, నిర్మాల, కోమలి, కాశయ్య పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుండే

ప్రత్యేక దృష్టి సారించాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే విద్యార్థులు విద్యార్థి దశ నుండే ప్రత్యేక దష్టి సారించాలని కలెక్టర్ ఎస్.దినేష్‌కుమార్ సూచించారు. మండల కేంద్రమైన సంతనూతలపాడులోని బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత పాఠశాలకు భూమిని దానం చేసిన కీర్తిశేషులు వింగ్ కమాండర్ ఎస్ వి ప్రసాద్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించి అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉపాధ్యాయుల సహకారంతో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. పదో తరగతి పరీక్షల గడువు చాలా తక్కువగా ఉన్నందున ప్రణాళికాబద్ధంగా సమయాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఇంటర్మీడియట్‌లో కూడా మంచి కోర్సును ఎంపిక చేసుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. పాఠశాల స్థలదాత స్ఫూర్తిని మరువకూడదని పేర్కొన్నారు. గ్రామంలోని మురుగు నీరంతా స్థల సమీపంలోకి వచ్చి చేరుతుందని దాని ద్వారా దుర్వాసన వస్తుందని అంటువ్యాధులు పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఈ పరిసర ప్రాంతాల్లో చిల్ల చెట్లు పెరిగాయని దానిద్వారా విష సర్పాలు పాఠశాల పరిధిలో సంచరిస్తున్నాయని స్థల దాత కుటుంబీకులు చేసిన విజ్ఞప్తి మేరకు కలెక్టర్ పాఠశాలను సందర్శించారు. మురుగునీరు నిల్వ లేకుండా ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. కలెక్టర్ వెంట స్థలదాత సతీమణి ఎస్.ఇందిరాప్రసాద్, కుమారుడు ఎస్.అరుణ్‌ప్రసాద్, కుమార్తె ఆశ, డీఈవో రమేష్, ఎంఈఓ సనత్ కుమార్, తహశీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, ఎంపిడిఒ కె.రాఘవేంద్ర, పాఠశాల ప్రిన్సిపల్ వి.మెర్సీ, పీఆర్ ఏఈ రవిబాబు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ వాలిబాబు, సర్పంచి డి నాగమణి, జడ్పీటీసీ డి.రమణమ్మ, గ్రామ కార్యదర్శి పోతురాజు, ఏపీఎం సుధాకరరావు, ఏఓ పావని ఉన్నారు.